# స్వామియే శరణం

-కాకాని కమల

రామయ్య వేగంగా రోడ్డు మీద పరిగెడుతున్నాడు

అది గమనించిన బావమరిది రమణయ్య తనూ వెంట పరిగెడుతూ—

"ఎందుకు పరిగెడుతున్నావ్?" అడిగాడు.

"తెలియదు."

"తెలియదా?"

"పోనీ... ఎందాకా?"

"అదీ తెలియదు."

"ఏమిటీ? అదీ తెలియదా?"

"ఊహు..."

"ఎందుకు పరిగెడుతున్నావో తెలియదు. ఎందాకో తెలియదు.అవునా?"

"అవును"

రామయ్య సత్తెకాలపు మనిషి. తెల్లనివన్నీ పాలు అనుకునే రకం. లౌక్యం అసలే ఎరగడు. అలాంటివాడు ఎందరు చెప్తున్నా వినకుండా ఇల్లు తాకట్టుపెట్టి ఈ మధ్య వ్యాపారం మొదలు పెట్టాడు. రోజూ ఈ సమయానికి దుకాణంలో కూర్చునేవాడు. అలాంటిది ఇవ్వాళ రోడ్డమ్మట పరిగెడుతున్నాడు.

"అప్పలాళ్ళు ఎవరన్నా ... అదే ... నువ్వు బాకీ వున్నవాళ్ళు ఎవరన్నా నీ వెంట పడ్డారా?"

"లేదు."

"పోనీ ... ఎవరన్నా రౌడీ వెధవగాని దొంగ-గూండా బోటివాడు గాని నిన్ను తరుముతున్నారా? బెదిరిస్తున్నారా?"

"అబ్బే కాదు."

"పండగ ఈనాములని, గుడి చందా అని పీక్కు తింటున్నారా?"

"అదీ కాదు"

"పిచ్చి కుక్కలు వెంట పడ్డాయా?"

"లేదు."

"పోనీ ... మీ అల్లుడేమన్నా మీ ఇంటికి వచ్చి తిష్టవేశాడా?"

"అబ్బే ..."

"మరెందుకయ్యా బాబూ! ఏ కారణం లేకుండా నువ్వెందుకు పరిగెడుతున్నావ్?" రామయ్య వెంట పరిగెత్తలేక అలసిపోతూ – కారణం తెలుసుకోవాలన్న కుతూహలంతో అడిగాడు రమణయ్య.

"ఉదయం గుడికి వెళ్ళా"

"అయితే ...?"

"ఇప్పుడు అన్ని రంగాల్లో పోటీ పెరిగిందిట. అంతా ఫాస్టట. ఏ రంగంలోనయినా సరే ... విజయం సాధించాలి – పై స్థాయికి చేరుకోవాలి అంత ఉన్నతస్థితి అందుకోవాలంటే విశ్రాంతి అన్నది తెలియకుండా అలుపు అన్నది లేకుండా మనిషి పరిగెత్తాలిట. అలా పరిగెడితేనే ఈ పోటీ ప్రపంచంలో ముఖ్యంగా వ్యాపార రంగంలో విజయం సాధించగలరంట. పరుగు ఆపకూడదట. గుళ్ళో స్వామి వారు తన గృహస్థాశ్రమ ధర్మోపన్యాసంలో ఇందాక చెప్పారు. నేను కూడా కొత్తగా పెట్టిన నా వ్యాపారంలో విజయం సాధించాలని ఇలా పరిగెడుతున్నాను" పరుగెడుతూనే చెప్పాడు రామయ్య. కాని అప్పటికే రమణయ్య ఆగిపోయాడు.

"వార్నీ! ఇంత అమాయకుడివి ... సత్తెకాలం వాడివి నువ్వు ఈ పద్ధతిలో వ్యాపారంలో విజయం సాధించాలంటే ... స్వామియే... ..."

◆

## అలజడి

రేఖామాత్రంగా మెరిసిన విద్యుల్లత<br>
రసరమ్య గీతిక దీప్తి అనిపించింది<br>
మెరుపు మాయమైన వెంటనే—కళ్ళు<br>
మిరుమిట్లు పొంది చీకట్ల జీరల దారాలను<br>
వేలాడేసుకుంటాయని తెలిసి<br>
మనసు—పంజరంలో చిక్కిన రాచిల్క రెక్కయి<br>
టపటప కొట్టుకుంది...<br>
నరాల్లో రక్తం ఉష్ణోగ్రత పెరిగి<br>
కపాలాన్ని కంపింప జేసింది<br>
రోజులు వాడిన రోజాపూలై పోతుంటే<br>
ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఉరేసుకుందామనుకున్నాయి...!<br>
జతల జతల కాళ్ళు అసంఖ్యాకంగా<br>
జడత్వ జాఢ్యం పాలైన రోడ్డు మీద సాగుతున్నాయి...<br>
ఆలోచనల్లు హార్మోనియం మెట్లై నొక్కబడుతూంటే<br>
అందమైన 'ఆ' పాదాల దర్శనం లేక అపశ్రుతి పాలవుతున్నాయి<br>
లోకం ఒక వానపాము—<br>
విచిత్రమైందది అంటారు—...కాని,<br>
'కానీ' మీద నిలబడి గిర గిర తిరుగుతూ<br>
కానీతో ఖూనీ చేయబడ్తూ<br>
కళ్ళుండీ కబోదియై ఊగిసలాడుతుంది<br>
నమ్మకం నట్టేట్లో మునక లేస్తుంటే<br>
మాట మూటలో దాగి పుచ్చిన గూటానికి<br>
వ్రేలాడుతూంది

– ఉమ్మెత్తల